సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



అవగాహన పెంచుకోవాలి

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీసీపీ నర్సింహ సూచించారు. 8లో▸



పుష్కరిణిలో వ్యక్తి గల్లంతు

చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో స్నానానికి వెళ్లిన ఓ తాపీ మేస్త్రీ నీట మునిగి గల్లంతయ్యాడు. 8లో▸

మూడో రోజు ఐదు

రాజేంద్రనగర్: చేవెళ్ల లోక్‌సభ స్థానానికి మూడోరోజు శనివారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. మహమ్మద్ నలీం (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్, సెక్యులర్), టి.దుర్గా ప్రసాద్ (ప్రజా వెలుగు పార్టీ), తోట్ల రాఘవేందర్ (ధర్మ సమాజ్ పార్టీ), ఆంజనేయులు నీరటి (స్వతంత్ర), ఇసరి సూర్యప్రకాష్ రెడ్డి (స్వతంత్ర) నామినేషన్లు దాఖలు చేశారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడి పనిచేయండి

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వారు రంజిత్‌రెడ్డి సమక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి రంజిత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ 15 రోజులు పార్టీకోసం మీరు కష్టపడితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం మేము మీవెంట ఉండి పనిచేస్తామని చెప్పారు. అంతా కలిసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకుందామని, గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్‌రెడ్డితో ఫొటో దిగుతున్న స్థానికులు

చేవెళ్ల: శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి వచ్చారు. మండలంలోని జన్వాడలో ఆయన పేరుపై ఉన్న 1.20 ఎకరాల భూమిని ఇతరులకు విక్రయించారు. రిజిస్ట్రేషన్‌కోసం ఆయన ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్ సురేందర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి పంపించారు. తహసీల్దార్ కార్యాలయం వద్దకు కిరణ్‌కుమార్‌రెడ్డి రావడం గమనించిన స్థానికులు ఆయనను కలిసి పలకరిస్తూ ఫొటోలు దిగారు. రిజిస్ట్రేషన్ అనంతరం ఆయన హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

పల్లెలకు బీఆర్ఎస్ ప్రచార వాహనాలు

పూజలు చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎన్నికల ప్రచార రథాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రచార వాహనాలను సిద్ధం చేసి వాటికి పూజలు చేశారు. మండలంలోని కుమ్మెర బస్‌స్టేజీ వద్ద ఉన్న బంగారు మైసమ్మ దేవాలయం వద్ద శనివారం ప్రచార వాహనాలకు పూజలు చేసి వాటిని గ్రామాల్లో ప్రచారాలకు పంపించారు. రావులపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య ముందుగా చేవెళ్ల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఒకసారి మార్పు కోరుకొని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని.. ఇచ్చిన అధికారాన్ని ఆ పార్టీ నిలబెట్టుకోలేకపోతోందని అన్నారు. ప్రజలు ఇప్పుడు ఎందుకు బీఆర్ఎస్‌ను పోగొట్టుకున్నామా అని బాధపడుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏల ట్రైనర్‌గా గౌరీ సతీష్

మొయినాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఎల్‌ఏలకు శిక్షణ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ట్రైనర్లను నియమించింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్‌ను సికింద్రాబాద్, మెదక్, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల బూత్ లెవెల్ ఏజెంట్(బీఎల్ఏ)లకు శిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్‌గా నియమిస్తూ టీపీసీసీ వార్ రూం చైర్మన్ ప్రవీణ్ మల్లాడి ఉత్తర్వులు జారీ చేశారు.

పోలారం గ్రామంలో సాగవుతున్న వంకాయ తోట



కూరల పోలారం

ఊరు-ఊరంతా కూరగాయల బాట

అక్కడ ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఊరు ఊరంతా కూరగాయలు సాగు చేస్తున్నారు. గుంట మొదలు ఎకరా, రెండెకరాలు ఉన్న రైతులు కూరగాయలతో పాటు ఆకుకూరలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. నీటి వనరులు అంతగా లేకపోయినప్పటికీ ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు 'సాగు'తున్నారు. తక్కువ సమయంలో చేతికి వచ్చే ఆరుతడి పంటలను ఎంచుకుని సిరుల పంట పండిస్తున్నారు షాబాద్ మండల పరిధిలోని పోలారం గ్రామస్తులు.

- అన్నిరకాల ఆకుకూరలు, కూరగాయల సాగు
- ఇక్కడి ఉత్పత్తులకు మార్కెట్‌లో ఫుల్ డిమాండ్
- మంచి లాభాలు ఆర్జిస్తున్న రైతులు
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



క్యారెట్‌ను శుద్ధి చేస్తున్న మహిళా కూలీలు

షాబాద్: కూరగాయల సాగుకు పెట్టింది పేరు పోలారం. ఈ గ్రామంలో 100 కుటుంబాలు మాత్రమే నివాసముంటాయి. ఇక్కడి రైతులు టమాటా, వంకాయ, క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ, కాలిఫ్లవర్, చిక్కుడు, కీర, బీరకాయ, పచ్చిమిర్చి తదితర పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు లేకున్నా డ్రిప్, స్ప్రింక్లర్‌లతో సాయంతో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఏడాది పొడవునా కూరగాయలను పండిస్తూ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఏళ్లుగా తాము కూరగాయాలు, ఆకుకూరలు పండిస్తూనే జీవనం సాగిస్తున్నామని, తమ పిల్లలను చదివించుకుంటున్నామని రైతులు గర్వంగా చెబుతున్నారు.

సీజన్ బట్టి సాగు

సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టపోవడం కన్నా కూరగాయల సాగుతోనే లాభాలు గడించవచ్చని ఒకరిని చూసి మరొకరు అదే బాటలో పయనిస్తున్నారు. సీజన్‌ను బట్టి ఆకుకూరలతో పాటు క్యారెట్, బీట్‌రూట్, బెండ, గోరుచిక్కుడు, చామగడ్డ, చిక్కుడు సాగు చేస్తున్నారు. ఒక్కసారి పాలకూర వేస్తే నెలరోజుల వరకు నిత్యం రూ.200 వరకు సంపాదిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులంతా పొలంలో పని చేస్తారు. చదువుకునే విద్యార్థులు సెలవు రోజుల్లో పొలం పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు.

ఉన్న నీటిని ఒడిసిపట్టి..

భూగర్భజలాలు అడుగంటడంతో ఉన్న తక్కువ నీటితో కూరగాయలు సాగుచేసి ఆర్థికాభివృద్ధి పొందుతున్నారు. పండించిన కూరగాయలను శంషాబాద్, హైదరాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల మార్కెట్‌లకు తరలిస్తున్నారు. గ్రామంలో 100 నివాస గృహాలుండగా, 390కిపైగా ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. నీటి వనరులు పెద్దగా లేవు. 500 నుంచి 600 ఫీట్లలోతు బోర్లు తవ్వినా చెప్పుకోదగ్గ నీటి ఊటలు లేవు. వచ్చే కొద్ది పాటి నీటితో ఆరుతడి పంటలు పండిస్తూ మంచి ఆదాయం గడిస్తున్నారు.

ఒక్కోరైతు అన్ని రకాలు

ఆ ఊళ్లోని రైతులు అన్నిరకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. టమాట, వంకాయ, పచ్చిమిర్చి, దోసకాయ, బీరకాయ, కొత్తిమీర, చిక్కుడుతోపాటు వివిధ రకాలు పండిస్తున్నారు. ఒక ఎకరంలో క్యారెట్ సాగు చేస్తే రూ.లక్ష వరకు ఖర్చు వస్తుందని, ఖర్చులు పోను రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతు చెబుతున్నారు.



కాలీఫ్లవర్

ఇదే జీవనాధారం



ఏడాది పొడవునా కూరగాయాల సాగుతోనే మా కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. మేం సాగు చేసిన వంకాయ, టమాట, క్యారెట్, బీట్‌రూట్ మార్కెట్‌కు వెళ్లగానే వ్యాపారులు వెంటనే కొనుగోలు చేస్తారు.

– మహేందర్‌రెడ్డి, రైతు, పోలారం

డ్రిప్, మల్చింగ్ పద్ధతుల్లో..



అరెకరంలో టమాట వేశాను. బోరు ఆగిఆగి పోస్తోంది. నీటి కొరతతో డ్రిప్, మల్చింగ్ పద్ధతుల్లో సాగు చేస్తున్నాం. రూ.50వేల వరకు ఖర్చు వచ్చింది. రూ.2లక్షల వరకు లాభం వస్తుందని ఆశిస్తున్నాం.

– వెంకట్‌రెడ్డి, రైతు, పోలారం

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి



గతంలో ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీపై కూరగాయల విత్తనాలు ఇచ్చేది. ప్రస్తుతం వాటిని ఇవ్వడం మానేశారు. వేల రూపాయలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి సబ్సిడీ విత్తనాలతో పాటు డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు ఇచ్చి ఆదుకోవాలి.

– రాంరెడ్డి, రైతు, పోలారం

తాజా కూరగాయలకు భలే గిరాకీ

ఆయా మార్కెట్లలో పోలారం గ్రామం నుంచి వచ్చే కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. నాణ్యమైన, తాజా ఆకుకూరల ఉత్పత్తికి పేరుగాంచింది. ప్రభుత్వ ప్రోత్సాహం కోసం గానీ, బ్యాంకుల ఆర్థిక సాయం కోసం గానీ వీరు ఎదురుచూడడం లేదు. ఎంత కష్టపడితే అంత ఫలితం ఉంటుందన్న సిద్ధాంతాన్ని నమ్ముకుని విజయాల బాటలో ముందుకు సాగుతూ మరెందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

అకాల వర్షం.. తీరని నష్టం

- నేలరాలిన మామిడి, దెబ్బతిన్న వరిపంట
- పిడుగు పాటుకు ఎనిమిది ఆవులు మృతి
- విరిగిపడిన చెట్ల కొమ్మలు.. తెగిపడిన లైన్లు
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం



కందుకూరు: నేలరాలిన మామిడి కాయలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అకాల వర్షం.. తీరని నష్టాన్ని మిగిల్చింది. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో మామిడి, బొప్పాయి సహా చేతికొచ్చిన వరి పంట నేల రాలింది. ఈదురు గాలులకు యాచారం మండలం మాల్, కిషన్‌పల్లి, తమ్మలోనిగూడ గ్రామాల్లో పశువుల రేకుల షెడ్లు గాలికి లేచిపోయాయి. పిడుగు పాటుకు తలకొండపల్లి, కడ్తాల్, యాచారం మండలాల్లో ఎనిమిది ఆవులు మృతి చెందాయి. కందుకూరు, చేవెళ్ల, మొయినాబాద్, యాచారం మండలాల్లో మామిడి సహా ఇతర పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షం సృష్టించిన బీభత్సానికి రైతులు పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వచ్చింది. చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడటంతో లైన్లు తెగిపడటంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నేలకూలిన విద్యుత్ స్తంభాలు

ఈదురు గాలితో కూడిన వర్షానికి తుర్కయాంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్సీకాలనీలో 11కేవీ విద్యుత్ స్తంభం నేలకూలింది. మరో రెండు ప్రాంతాల్లో లైన్లపై చెట్ల కొమ్మలు పడి సరఫరా నిలిచిపోయింది. నాదర్‌గుల్, గుర్రంగూడలోనూ లైన్లపై చెట్లు కూలి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. హయత్‌నగర్‌ని శాంతినగర్‌లో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టడంతో నేలకూలింది.చంపాపేట్, సరూర్‌నగర్, బాలాపూర్, కందుకూరు, నార్సింగి, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడటంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.వర్షం వెలిసిన వెంటనే కొన్నిచోట్ల సరఫరా పునరుద్ధరించగా,మరికొన్ని చోట్ల మధ్యాహ్నం తర్వాత కూడా సరఫరాను పునరుద్ధరించలేక పోయా రు. ఉక్కపోత నుంచి ఉపశమనం లభించడంతో జిల్లా వాసులు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

నేల రాలిన మామిడి, బొప్పాయి

కందుకూరు మండలం దెబ్బడగూడలో కురిసిన వడగళ్ల వర్షానికి 88 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. కందుకూరు, కొత్తూరు, ముచ్చర్ల, లేమూరు తదితర గ్రామాల్లో 35 ఎకరాల్లో మామిడి నేలరాలింది. 40 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఏడు ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. చేవెళ్ల మండలంలో రెండురోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో మండలంలోని ధర్మ సాగర్, కమ్మెట గ్రామాల్లో అకాల వర్షానికి 12 ఎకరాల్లో బొప్పాయి తోట, మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి, నస్దిక్‌సింగారం, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, నందివనపర్తిలో దాదాపు 50 ఎకరాల మామిడి తోట దెబ్బతింది. వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను రికార్డు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.

పిడుగులు పడి ఎనిమిది ఆవులు మృతి

తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్‌ల్లో ఈదురు గాలులతో కూడిన వర్షానికి కరెంట్ తీగలు తెగి పొలంలో కట్టేసిన రెండు ఆవులపై పడ్డాయి. విద్యుద్ఘాతానికి గురై రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. కొత్తూరు మండలం కొడిచర్లలో పిడుగు పాటుకు ఆవు సహా దూడ మృతి చెందింది. కడ్తాల్ మండలం రావిచేడులో పిడుగుపాటుకు పొలం వద్ద కట్టేసిన ఆవు మృత్యువాత పడింది. యాచారం మండలం నస్దిక్‌సింగారంలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. ఒక్కో ఆవు ఖరీదు రూ.లక్షకుపైగా ఉన్నట్లు అంచనా. పాడి ఆవులు మృతి చెందడంతో వాటిపై ఆధార పడి జీవిస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు.



చేవెళ్ల మండలం ధర్మాసాగర్‌లో దెబ్బతిన్న బొప్పాయిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

శ్రీవారికి వాహన సేవలు

- గోప, హనుమంత వాహనాలపై ఊరేగిన చిలుకూరు బాలాజీ

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారు గోప, హనుమంత వాహన సేవలు అందుకున్నారు. శనివారం రాత్రి స్వామివారిని మొదటగా గోపవాహనంపై ఆసీనులను చేసి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం హనుమంత వాహనంపై ఊరేగింపును అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా వేదపారాయణం, పూజలు, మంగళహారతి సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నర్సింహాచార్యులు, కిట్టు, కృష్ణమూర్తి, కన్నయ్య, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని సూర్యప్రభ వాహనం, గరుడ వాహనంపై ఊరేగించి సేవలు అందించనున్నారు. ఆదివారం రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు.

'వివాహ ప్రాప్తి' రద్దు

చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఆదివారం తలపెట్టిన 'వివాహ ప్రాప్తి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం సందర్భంగా సంతానం లేని మహిళలకు 'సంతాన ప్రాప్తి' కోసం గరుడ ప్రసాదం పంపిణీ, ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా వివాహం ఆలస్యమయ్యే వారికోసం 'వివాహ ప్రాప్తి' చేపట్టాలని ముందుగా నిర్ణయించామన్నారు. శుక్రవారం జరిగిన గరుడ ప్రసాదం పంపిణీకి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఇబ్బందులు జరిగాయని ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించే 'వివాహ ప్రాప్తి'కి కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం యథావిధిగా జరుగుతుందని.. భక్తులు ఇంటి దగ్గరి నుంచే వివాహ ప్రాప్తికోసం స్వామివారికి మొక్కుకోవాలన్నారు. కల్యాణోత్సవానికి ఎవరూ రావద్దని సూచించారు.



గోప వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి

- ప్రజాభిప్రాయం పట్టని కాంగ్రెస్, బీజేపీ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై భ్రమలు తొలిగాయి
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

ఆమనగల్లు: ప్రాంతీయ పార్టీలతోనే రాష్ట్రాల్లో అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో శనివారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు రంగినేని అభిలాష్‌రావ్, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం హాజరయ్యారు. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రాభవం కోల్పోతోందని, ప్రధాని మోదీ ఆకర్షణ తగ్గిందన్నారు. కొన్ని మీడియా సంస్థలు బీఆర్ఎస్‌పై విష ప్రచారం సాగిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలు, పదేళ్ల కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలగిపోయాయని, ఎందుకు ఓటు వేశామా అని పశ్చాత్తప పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉన్నత విద్యావంతుడు ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తే లోక్‌సభలో అణగారిన వర్గాల ప్రజల గొంతుకగా నిలుస్తాడని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని, తనపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని, అవగాహన లేని వ్యక్తులు, స్థానికేతరులను నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీలు అనురాధ, దశరథ్‌నాయక్, విజితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ..

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


ఉపేందర్ (ఫైల్)

చేవెళ్ల: కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి బస్ స్టేజీ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముడిమ్యాల గ్రామానికి చెందిన పి.నారాయణ కుమారుడు ఉపేందర్(21) గ్రామంలోని టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. బైక్‌లో పెట్రోల్ పోయిచేందుకు ఉపేందర్ మరో యువకుడు ఉదయ్‌కిరణ్ దేవుని ఎర్రవల్లి వద్ద ఉన్న పెట్రోల్ పంప్‌కు వచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా చేవెళ్ల నుంచి వేగంగా ప్రయాణిస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ ఉన్న ఉపేందర్ ద్విచక్రవాహనం పై నుంచి ఎగిరి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయ్‌కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిని వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఉపేందర్ పరిస్థితి విషమంగా ఉందని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఉపేందర్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు మండలంలోని జాలగూడ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు అండగా ఉంటా

- కొండా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మహేశ్వరం: ప్రజలకు అందుబాటులో ఉండని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండరని.. ఆయన్ను ఎవరూ గుర్తుపట్టరని అటువంటి అభ్యర్థికి ఓటేసినా ప్రయోజనం శూన్యం అన్నారు. గతంలో ఆయన ఎంపీగా పని చేసినా నియోజకవర్గానికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు. మత విద్వేశాలు రెచ్చగొట్టి యువతను ఓటు బ్యాంకుగా మలుచుకునేందుకు బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. యువత, ఓటర్లు బీజేపీ వలలో పడొద్దని సూచించారు. తాను చేవెళ్ల ఎంపీగా నియోజకవర్గానికి రోడ్లు, భవనాలు తీసుకువచ్చానని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అండగా ఉంటానని మాటిచ్చారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోని వస్తుందని రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. ప్రతీ ఒక్కరు ప్రజలకు కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో పాటుగా పాంచ్ న్యాయ్‌ను వివరించాలన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో చేపట్టాల్సిన వ్యూహాలను నేతలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి, నియోజకవర్గ ఎంపీ ఎన్నికల పరిశీలకులు నేరేళ్ల శారద, నిజాముద్దీన్, మహేశ్వరం ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్, రఘుపతి, కూన యాదయ్య, ఆవుల యాదయ్య, నర్సింహ, అంధ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

పుష్కరిణిలో వ్యక్తి గల్లంతు

- రోజంతా వెతికినా దొరకని ఆచూకీ
- బాధితుడు ఏపీలోని ప్రకాశం జిల్లా వాసి


రవి(ఫైల్)

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి పుష్కరిణిలో స్నానానికి వెళ్లిన ఓ తాపీ మేస్త్రీ నీట మునిగి గల్లంతయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. శనివారం గజ ఈతగాళ్లు రోజంతా వెతికినా మృతదేహం లభించలేదు. వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సొంతరావు గ్రామానికి చెందిన తానే రవి(38) ఇరవై ఏళ్ల క్రితం రాజేంద్రనగర్ మండలం బంగ్లగూడ ప్రాంతంలోని కాళీమందిర్ వద్ద నివాసం ఉంటూ.. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల షాబాద్ మండలంలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో ఓ ఇల్లు కట్టేందుకు పనిని గుత్తకు తీసుకున్నాడు. శుక్రవారం పనికి వచ్చిన ఆయన సాయంత్రం చేవెళ్లకు చేరుకున్నాడు. ఆయనతో పాటు మరో ఇద్దరు తెలిసిన వ్యక్తులు ఉండటంతో ముగ్గురు కలిసి చేవెళ్లలోని వేంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి(గుండం)లోకి స్నానానికి వెళ్లారు. మద్యం సేవించిన వారు ఇద్దరు ఒడ్డున స్నానం చేస్తుండగా రవి గుండం మధ్యకు ఈదుకుంటూ వెళ్లి ఆయాసం రావడంతో నీట మునిగాడు. ఒడ్డున ఇద్దరు వ్యక్తులు అతన్ని కాపాడేందుకు విఫలయత్నం చేశారు. వారు వెంటనే చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించారు. నీటిలో మునిగిపోవటంతో పోలీసులకు జాడ కనిపించలేదు. ఈత వచ్చిన వారితో గాలించినా ఫలితం లభించలేదు. శనివారం ఉదయం గుండంలో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరక్క సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ వీరబ్రహ్మం గజ ఈతగాళ్లను పిలిపించి వెతికించారు. గుండలంలో నీరు ఎక్కువగా ఉండటంతో పాటు పెద్దగా ఉండటంతో మృతదేహం ఎక్కడ ఉందనేది తెలియడం లేదన్నారు.


మాట్లాడుతున్న సైబర్ క్రైం డీసీపీ నర్సింహ

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

సైబర్ క్రైం డీసీపీ నర్సింహ

నందిగామ: సైబర్ నేరాలపట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీసీపీ నర్సింహ సూచించారు. శనివారం మండల పరిధిలోని కన్హా శాంతివనంలో కన్హా హార్ట్‌ఫుల్‌నెస్ లెర్నింగ్ సెంటర్‌లో ఎస్‌సీ(సైబర్ క్రైం ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ) దిల్‌సే (యువతకు భద్రత కల్పించేందుకు డిజిటల్ అక్షరాస్యత) బృందం సహకారంతో విద్యార్థుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైబర్ క్రైం డీసీపీ నర్సింహ సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులు సెల్‌ఫోన్స్‌కు బానిసలవ్వడం, గేమింగ్, బెట్టింగ్ యాప్‌లకు, సోషల్‌మీడియాలకు ఆకర్శితులై నష్టపోయే తీరును వివరించారు. మోసాలకు గురైన వారు సైబర్‌క్రైం రిపోర్టింగ్ 1930 ని ఏ విధంగా ఉపయోగించువాలో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు రవీందర్ రెడ్డి, చంద్రకాంత్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అజయ్ కుమార్, భానుమూర్తి, సైబర్ సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా అథ్లెటిక్స్ క్రీడా పోటీలు

లక్డీకాపూల్: రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటల నుండి ఎల్‌బీ నగర్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో అథ్లెటిక్స్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఇ.గోపి తెలిపారు. 12 సంవత్సరాలు పైబడిన వారికి అండర్ 14, 16, 18, 20, మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో 100మీ, 600మీ, 800మీ, 1500మీ, 2000మీ, 5000మీ పరుగు పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాలకు రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పన సాయిరెడ్డిని 9703838987 నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

వ్యవసాయ వర్సిటీలో ఈద్ మిలాప్

ఏజీవర్సిటీ: సర్వమతాలవారు కలిసిమెలిసి ఉన్నప్పుడే సంస్థలు, సమాజం ప్రశాంతంగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ అభిప్రాయపడ్డారు. రంజాన్ పండుగని పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలో శనివారం ఈద్ మిలాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని మతాల వారు తమ పండగలను ప్రశాంతంగా నిర్వహించుకునే వాతావరణం దేశంలో తరతరాలుగా ఉందన్నారు. దీన్ని భవిష్యత్తులోనూ కొనసాగించుకోవాలని సూచించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి షీర్ ఖుర్మా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ సీజ్

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని ప్రాంతంలో అక్రమంగా నీటి సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్‌ను తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అక్రమంగా నీటి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు హెచ్చరించారు.

నేరాలను అరికట్టండి

సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో రాత్రి దొంగతనాలు, దారి దోపిడీలు, హిజ్రాల వేధింపులు ఎక్కువవుతున్నాయని, వాటి నివారణకు పోలీస్ గస్తీని పెంచాలని సంక్షేమ సంఘం నాయకులు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని కోరారు. శనివారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దొంగతనాలను నివారించేందుకు అవసరమైన గస్తీ పెంచాలని సీఐని కోరామన్నారు.